RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 2 సంచిక : 339 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 08 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 339 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 08 December 2025 PAGES : 8 PRICE : 3/-



## శ్రీవారి సొమ్ము కొట్టేసిన దొంగతో సెటిల్మెంట్ ఏంటి?

జగన్‌కు బాబాయ్ హత్యే చిన్నదైనప్పుడు పరకామణిలో చోరీ పెద్దది ఎలా అవుతుంది?

వైకాపా అధినేతకు దేవుడన్నా, భక్తుల మనోభావాలన్నా లెక్కలేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపాటు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 07)

వైకాపా అధ్యక్షుడు జగన్‌కు.. సొంత బాబాయి హత్యే చిన్న విషయమైనప్పుడు, తిరుమల పరకామణిలో చోరీ ఘటన పెద్ద విషయం ఎలా అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ఏమాత్రం -మిగతా 2లో



## గిరిజనుల ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 07)

'అడవిని నమ్ముకుని బతికే గిరిజనుల జీవన ప్రమాణాలు పెరిగేలా యంత్రాంగం పనిచేయాలి. వారి ఆదాయ మార్గాలు పెంచాలి. అందుకు తగినట్లు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, ఎకో టూరిజం, పర్యాటకం అంశాల ప్రాతిపదికగా గిరిజన యువతకు నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్‌లతో శనివారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీలుగా పనిచేసిన సుమిత్‌కుమార్, సతీష్‌కుమార్‌లు సైతం పాల్గొన్నారు. 'గిరిజనుల జీవన -మిగతా 2లో

## ఈ పవిత్ర భూమిలో అడుగుపెట్టడం నన్ను ముగ్ధుడ్ని చేసింది: పవన్ కల్యాణ్

బృహత్ గీతోత్సవంలో పాల్గొని భగవద్గీత సందేశాన్ని స్మరించుకున్న పవన్

శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలోని కార్యక్రమాలపై ప్రశంసలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 07)

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉడుపిని సందర్శించారు. ఈ పవిత్ర భూమి భారతదేశపు ఆధ్యాత్మిక శక్తి కేంద్రమని ఆయన అభివర్ణించారు. శ్రీకృష్ణుడు నిత్యం కొలువై ఉండే ఈ నేలపై అడుగుపెట్టడం తన అదృష్టమని పేర్కొన్నారు. బృహత్ గీతోత్సవం శుభ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు కోరుకోవడానికి ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "శ్రీకృష్ణుడు కొలువైన, -మిగతా 2లో

# ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం..

## మా కుటుంబానికి మీరు కొండంత బలం: మంత్రి లోకేశ్

- ప్రతిపక్షంలో అండగా నిలిచిన ప్రవాసులను గుండెల్లో పెట్టుకుంటామన్న లోకేశ్
- కూటమి ప్రభుత్వ లక్ష్యం 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమన్న మంత్రి
- చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టేది లేదని వ్యాఖ్య... రెడ్ బుక్ ప్రస్తావన
- ఏపీని స్పీడ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారుస్తామన్న లోకేశ్
- స్పీడ్ కు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్ గా మారిందన్న మంత్రి
- విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఏ కష్టం వచ్చినా ఏపీ ఎన్ఆర్టీ అండగా ఉంటుందన్న మంత్రి
- డల్లాస్ తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్




(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 07)

ప్రతిపక్షంలో అండగా నిలిచిన ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం, మా కుటుంబానికి మీరు కొండంత బలం ఇచ్చారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అమెరికా డల్లాస్ లోని కర్టిస్ కల్ వెల్ సెంటర్ లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా శ్రీ హరిహరపీఠం వేదపండితులు మంత్రి లోకేశ్ కు వేదాశీర్వచనాలు అందించారు. అనంతరం ప్రవాసాంధ్రులను ఉద్దేశించి మంత్రి లోకేశ్ ప్రసంగిస్తూ.... ఈ సమావేశానికి విచ్చేసిన నాకు ప్రాణసమానమైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, జనసేన, బీజేపీ కార్యకర్తలకు నా హృదయపూర్వక నమస్కారాలు. -మిగతా 2లో

## సామాన్యుల కోసమే సుప్రీంకోర్టు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 07)

సామాన్యుల కోసమే సుప్రీంకోర్టు ఉందనే సందేశాన్ని స్పష్టంగా, బలంగా వినిపించాలని భావిస్తున్నామని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా వ్యాజ్యాలు పరిష్కారమయ్యేలా చూడటం, ఏకీకృత జాతీయ న్యాయ విధానం, పెండింగ్ కేసుల్లో శరవేగంగా తీర్పులు వచ్చేలా చేయడం తన ప్రాధాన్యాలుగా వివరించారు. దిల్లీలో శనివారం ఆయన 'హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్'లో ప్రసంగించారు. సాధారణ పౌరులు దాఖలు చేసే పిటిషన్లకూ సుప్రీంకోర్టులో తగినంత ప్రాధాన్యం, సమయం లభించి తీరాలన్నారు. దీనిపై తాను దృష్టిసారిస్తానని తెలిపారు. కక్షిదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించేలా చూస్తామన్నారు. న్యాయ స్వతంత్రతపై ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ...'భారత రాజ్యాంగంలో అధికారాల విభజనలు విస్పష్టంగా ఉన్నాయి. న్యాయ, శాసన, కార్యనిర్వాహక వర్గాలకు వాటి పరిధులు, పరిమితులు తెలుసు' అని తెలిపారు. వివాదాల సత్వర పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డిజిటల్ అరెస్టులు, సైబర్‌నేరాలు వంటి సరికొత్త సవాళ్లు ఎప్పటికప్పుడు తలెత్తుతూనే ఉంటాయని, వాటిని ఎదుర్కోవడానికి న్యాయవ్యవస్థ సన్నద్ధమవుతూనే ఉండాలన్నారు. కాలానుగుణంగా భారతీయ న్యాయవ్యవస్థ కూడా మారుతోందని చెప్పారు. న్యాయమూర్తుల నియామకాల్లో అన్ని ప్రాంతాలకు, వర్గాలకు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. భిన్నత్వం, సమ్మిళితం ద్వారా సుప్రీంకోర్టుకు సుసంపన్న సంస్కృతి సమకూరుతుందని అభిప్రాయపడ్డారు. భారతీయ న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు.

## గోవా అగ్నిప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ విచారం.. ఎక్స్‌గ్రేషియా ప్రకటన



- గోవా నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం - గ్యాస్ సిలిండర్ పేలడంతో 25 మంది మృతి
- ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- చాలా బాధాకరమైన సంఘటన అన్న ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 07)

గోవాలోని ఓ ప్రముఖ నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా ప్రాంతంలో ఉన్న బిర్చ్ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. -మిగతా 2లో

## నాపై జగన్ దుష్ప్రచారం చేస్తున్నారు: ఎంపీ వేమిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 07)

అప్పన్న కుటుంబానికి తాను సేవా భావంతో రూ.50 వేల చెక్కు ఇచ్చానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం జగన్ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి మాట్లాడారు. "వైఎస్ జగన్ నాపై అనవసరంగా కామెంట్స్ చేశారు. తానేంటో ఆయన ఆత్మకే వదిలేస్తున్నా. ఎవరు చెబితే నేను సాయం చేశానో తెలియదా? వైవీ సుబ్బారెడ్డి వద్ద పనిచేస్తున్న అప్పన్నకు నేను సాయం చేశాను. ఆయన మాట్లాడే విషయాలు సత్యమా, కాదా అనేది దేవుడి ఎదుట ప్రమాణం చేయాలి. సాయం కోసం ఎవరైనా అడిగితే ఇప్పటికీ చాలా మందిని ఆదుకుంటున్నా. ప్రతి నెలా నేను సాయం చేసే జాబితాలో చాలామంది ఉంటారు. ఈ విషయాలు ఆయనకు కూడా తెలుసు. ఎవరు చెబితే ఇచ్చానో వారికి ఈ విషయం తెలుసు. అసలు నాపై అలాంటి మాటలు మాట్లాడాల్సిన అవసరమే లేదు. -మిగతా 2లో



## పత్రాలు మాయం చేయడం కాకాణికి అలవాటుగా మారింది సోమిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 07)



కల్తీ మద్యం కేసు ఫైళ్లను వైకాపా నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాయం చేశారని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నెల్లూరులో మీడియాతో ఆయన మాట్లాడారు. కాకాణి పంపిణీ చేసిన కల్తీ మద్యం తాగి పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు.

"కేసుల డాక్యుమెంట్లు పరిశీలించే సమయానికి పత్రాలు మాయమయ్యాయి. పత్రాలన్నీ ఉంటేనే ప్రత్యేక కోర్టులో కేసుల విచారణ ప్రారంభమవుతుంది. విచారణ ముందుకెళ్లకుండా ఉండేందుకే పత్రాలను మాయం చేశారు. నేరాలతో పాటు పత్రాలు మాయం చేయడం కాకాణికి అలవాటుగా మారింది. ఆయన అత్తగారి ఊరు వావిలేటిపాడులో భూఆక్రమణ కేసు ఫైలు మాయమైంది. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో మళ్లీ ప్రత్యక్షమైంది. తాజాగా కల్తీ మద్యం కేసు డాక్యుమెంట్ల మాయంతో విచారణ ఆగిపోయింది" అని సోమిరెడ్డి అన్నారు.

# జిల్లా మైనారిటీ చైర్మన్‌గా డాక్టర్ షేక్ మహబూబ్ వలి

## ఘనంగా సత్కరించిన కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రజా సంఘాలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిసెంబర్ 7)

మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా మైనారిటీ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలిని వారి స్వగృహం లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇమ్రాన్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పదవుల్ని అలంకరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మీ నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. మైనారిటీల హక్కుల కోసం మీరు అండగా నిలుస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. గతంలో మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు ఉత్తమంగా నిర్వహించడం వల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త షేక్ సైదా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి నదీమ్ జావేద్ జిల్లా మైనారిటీ చైర్మన్‌గా ప్రకటించడం, ఏఐసీసీ వైఎస్ షర్మిలరెడ్డి చేతుల మీదుగా మీరు బాధ్యతలు చేపట్టడం మా అందరికి ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మీరు ఇలాంటి అనేక ఉత్తమ పదవులు అలంకరించాలని కోరుకుంటున్నామన్నారు. డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ అభివృద్ధి చెందడంలో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ పదవి బాధ్యతలు అప్పగించిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి, రాష్ట్ర మైనార్టీ చైర్మన్ షాలీదాదా గాంధీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా లకు కృతజ్ఞతలు తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

# ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం..

నేను అమెరికాలో నాలుగేళ్లు అండర్ గ్రాడ్యుయేషన్ చేశాను. రెండేళ్లు వాషింగ్టన్ డీసీలోని వరల్డ్ బ్యాంక్ లో పనిచేశాను. మరో రెండేళ్లు స్టాన్ ఫోర్డ్ లో ఎంబీయే చేశాను. ఈ దేశంలో సుమారు తొమ్మిదేళ్లు ఉన్నాను. కానీ, ఎప్పుడూ జరగని సంఘటన ఈ రోజు జరిగింది. నేను ఎయిర్ పోర్ట్ నుంచి బయటకు వస్తుండగా ఆరుగురు పోలీసులు వచ్చారు. వారు నన్ను ఇక్కడ ఆగండి అని చెప్పారు. బయట చాలా రద్దీగా ఉంది, మీరు బయటకు వెళ్లేందుకు పర్మిషన్ లేదు అని చెప్పారు. డల్లాస్ లో అడుగుపెట్టిన దగ్గర నుంచి ఈ రోజు ఈ కార్యక్రమం వరకు నాకు ఇంత పెద్ద ఘనస్వాగతం పలికిన మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

# నాపై జగన్ దుష్ప్రచారం చేస్తున్నారు: ఎంపీ వేమిరెడ్డి

సేవాభావంతోనే నేను సాయం చేస్తుంటా, సేవ చేయడం కూడా ఒక్కోసారి తప్పవుతోంది. నిందలు మోయాల్సి వస్తోంది. ఎంత చేశామో, ఎవరికి చేశామో, మనం చేసే మంచేంటో దేవుడికే తెలుసు. జగన్ మాటలు బాధ కలిగించాయి కాబట్టే ఇప్పుడు చెబుతున్నా" అని వేమిరెడ్డి పేర్కొన్నారు.

# గోవా అగ్నిప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ విచారం.. ఎక్స్‌గ్రేషియా ప్రకటన

క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మృతుల్లో 16 మంది క్లబ్ సిబ్బంది, ముగ్గురు మహిళలు, నలుగురు పర్యాటకులు ఉన్నారు. కొందరు మంటల్లో చిక్కుకుని మరణించగా, ఎక్కువ మంది దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇది చాలా బాధాకరమైన సంఘటన అని అన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# గిరిజనుల ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలి

ప్రమాణాలు పెంచాలి. అటవీ, ఆర్గానిక్ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉంది. అడవిలో దొరికే వివిధ ఉత్పత్తుల సాగును ప్రోత్సహించాలి. గిరిజనుల్లో ఉత్తేజం నింపేలా కొత్త కార్యక్రమాలు రూపొందించాలి. యువతను ఆంత్రప్రెన్యూర్లుగా మార్చాలి. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అందుబాటులోకి తీసుకురావాలి' అని పేర్కొన్నారు. ప్రతినెలా ఆయా అంశాలను సమీక్షిద్దామన్నారు.

**లోకేశ్ కృషి అభినందనీయం**

'విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే దృఢ సంకల్పంతో అధునాతన సదుపాయాలు, పోషకాహారం, ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్య అందించేందుకు విద్యా శాఖ మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. తాను మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ఉప ముఖ్యమంత్రిని ఉద్దేశించి విద్యా శాఖ మంత్రి లోకేశ్ చేసిన ప్రకటనకు పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. 'చిలకలూరిపేట శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్ సమావేశానికి హాజరైన పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఆ స్కూలు గ్రంథాలయానికి పుస్తకాలు, ర్యాక్‌లు, 25 కంప్యూటర్లు అందిస్తానని ప్రకటించిన పవనన్నకు ధన్యవాదాలు' అని లోకేశ్ ఎక్స్‌లో తెలిపారు.

# ఈ పవిత్ర భూమిలో అడుగుపెట్టడం నన్ను ముగ్ధుడ్ని చేసింది: పవన్ కల్యాణ్

ముఖ్యప్రాణ హనుమంతుడు శాశ్వత సంరక్షకుడిగా నిలిచిన, జగద్గురు మధ్వాచార్యులు తన జ్ఞానంతో ఎందరినో చైతన్యపరిచిన పవిత్ర భూమి ఉడిపి. మన నాగరికతకు ఆత్మలాంటి భగవద్గీత సందేశాన్ని జరుపుకునేందుకు భక్తులతో కలవడం ఆనందంగా ఉంది" అని తెలిపారు.


శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ దార్శనిక మార్గదర్శకత్వంలో ఈ పవిత్ర భూమి చారిత్రక ఆధ్యాత్మిక ఉద్యమాలకు సాక్షిగా నిలుస్తోందని పవన్ ప్రశంసించారు. కోటి భగవద్గీత చేతిరాత ప్రాజెక్టు నుంచి లక్ష కంఠ పారాయణం వరకు చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. భగవద్గీత సందేశం మన చర్యలకు మార్గనిర్దేశం చేసి, సమాజాన్ని బలోపేతం చేసి, జాతీయ స్ఫూర్తిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం జై శ్రీ కృష్ణ, జై హనుమాన్, జై హింద్ అంటూ తన సందేశాన్ని ముగించారు.

# శ్రీవారి సొమ్ము కొట్టేసిన దొంగతో సెటిల్మెంట్ ఏంటి?

నైతికత లేనివాళ్లే అలాంటి వ్యాఖ్యలు చేస్తారని మండిపడ్డారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పరకామణిలో చోరీ చాలా చిన్నదంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. "జగన్ వ్యాఖ్యలు భక్తుల మనోభావాల్ని దెబ్బతీసేలా ఉన్నాయి. జగన్‌కు దేవుడన్నా, భక్తులన్నా, ఆలయాల పవిత్రతన్నా లెక్కలేదు. దొంగతనం తప్పుకాదని చెప్పేవాళ్లను ఏమనాలి? దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు కట్టాడు కదా, తప్పేముందని జగన్ అనైతికంగా వాదిస్తున్నారు. బాబాయి హత్య అంశాన్నే జగన్ సెటిల్ చేసుకుందామని చూశారు. పరకామణిలో చోరీ వ్యవహారాన్నీ సెటిల్ చేయాలనుకున్నారు. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులు కొట్టేసిన దొంగతో సెటిల్మెంట్ ఏంటి? రూ.72 వేలు చిన్న దొంగతనమని జగన్ అంటున్నారు. చోరీ చేసిన వ్యక్తి స్వామివారికి రూ.14 కోట్ల విలువైన ఆస్తులు రాసిచ్చేందుకు సిద్ధపడ్డారంటే ఎంత దోచేసి ఉంటారు? దేవుడి హుండీలో చోరీ చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా?" అని మండిపడ్డారు. జగన్ వ్యాఖ్యలపై అన్ని వర్గాల ప్రజల్లోనూ తీవ్ర ఆవేదన కనిపిస్తోందని, వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అందరూ ఆ వ్యాఖ్యల్ని తప్పుపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీవారి ఆలయంలో ప్రతి అంశం భక్తుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉందన్నారు.

# సరిహద్దు రహదారులు.. జాతీయ భద్రతకు జీవనాధారాలు: రాజ్‌నాథ్ సింగ్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 07)



'సరిహద్దు రహదారులు.. జాతీయ భద్రతకు జీవనాధారాలు' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అత్యవసర సమయాల్లో సత్వరం స్పందించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో రూ.5000 కోట్లతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ నిర్మించిన 125 ప్రాజెక్టులను ఆదివారం ఆయన జాతికి అంకితం చేశారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పడానికి ఈ ప్రాజెక్టులే ఉదాహరణలని అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్ము, కశ్మీర్‌తోపాటు సరిహద్దు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మిజోరంలలో వ్యూహాత్మకంగా 28 రహదారులు, 93 వంతెనలు, మరో నాలుగు ఇతర ప్రాజెక్టులను బీఆర్‌వో నిర్మించింది. ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా జమ్ముకశ్మీర్‌లోని లేహ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. మన సైనికుల శౌర్యం, ధైర్యం మనందరికీ స్ఫూర్తి అని, దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ఈ ప్రాజెక్టులు అంకితమని అన్నారు. రోడ్డు నెట్‌వర్క్, రియల్ టైమ్ కమ్యూనికేషన్, ఉపగ్రహ ఆధారిత నిఘా తదితర సౌకర్యాలు మన సైనికులు మరింత వేగంగా, సమర్థంగా పని చేసేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా నూతన సాంకేతికతను వినియోగించి, సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసినందుకు 'బీఆర్‌వో'ను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. సాయుధ బలగాలతోపాటు బీఆర్‌వో సిబ్బంది, సరిహద్దు ప్రాంతాల పౌరులు జాతీయ భద్రతలో భాగస్వాములవుతున్నారని కితాబిచ్చారు. ఇదే స్ఫూర్తి కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లద్దాఖ్‌లోని దర్బుక్- శ్యోక్- దౌలత్ బెగ్ ఓల్డి మధ్య 920 మీటర్ల పొడవున నిర్మించిన సొరంగం గురించి రాజ్ నాథ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని కొనియాడారు. వాతావరణపరంగా ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా రవాణాకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా దీనిని నిర్మించినట్లు చెప్పారు. అంతేకాకుండా హిమపాతాల సమయంలోనూ సైన్యం ఆయుధాలు రవాణా చేసేందుకు ఇది వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందన్నారు.



# త్వరలోనే విశాఖలో ఆధునిక సైక్లింగ్ ట్రాక్ లు సీఎం చంద్రబాబు

## విశాఖలో ఫుట్‌పాత్‌లు, పచ్చదనంపై ఓ సంస్థ ప్రశంసలు
## బెంగళూరుతో పోలుస్తూ వైజాగ్‌ను కొనియాడిన సంస్థ
## నగరంలో సైక్లింగ్ లేన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
## ట్వీట్‌కు సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 07)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం నగర అభివృద్ధిపై కీలక ప్రకటన చేశారు. నగరంలో త్వరలోనే ఆధునిక సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'సివిక్ అపోజిషన్ ఆఫ్ ఇండియా' అనే సంస్థ ఎక్స్ వేదికగా చేసిన ఓ పోస్టుకు బదులిస్తూ సీఎం ఈ హామీ ఇచ్చారు. విశాఖ నగరంలో పాదచారులకు అనువుగా ఉన్న ఫుట్‌పాత్‌లు, ఆహ్లాదాన్ని పంచే పచ్చదనాన్ని ఆ సంస్థ ప్రశంసించింది. ఈ విషయంలో బెంగళూరు కంటే విశాఖ ఎంతో మెరుగ్గా ఉందని పేర్కొంది. సరైన వసతులు కల్పిస్తే దేశంలో తదుపరి ఐటీ హబ్‌గా ఎదిగే సత్తా విశాఖకు ఉందని అభిప్రాయపడింది. ఇదే స్ఫూర్తితో నగరంలో సైక్లింగ్ లేన్లను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను ట్యాగ్ చేస్తూ కోరింది.

ఈ ట్వీట్‌పై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. "విశాఖలో నడకకు అనువైన ఫుట్‌పాత్‌లు, పెరిగిన పచ్చదనం నగరవాసులకు, పర్యాటకులకు మంచి అనుభూతిని పంచుతున్నందుకు సంతోషంగా ఉంది. నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉన్నాం. ఈ దిశగా త్వరలోనే సైక్లింగ్ ట్రాక్‌లను కూడా ప్రారంభిస్తాం" అని ఆయన తన సమాధానంలో పేర్కొన్నారు.

# భారత విదేశాంగ మంత్రిపై పాకిస్థాన్ అక్కసు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 07)

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌పై పాకిస్థాన్ మరోసారి నోరు పారేసుకుంది. పాక్ సైన్యంతోనే భారత్‌కు ఎక్కువ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొనడం సరికాదని తెలిపింది. తమ వ్యవస్థలను, నాయకత్వాన్ని కించపరిచేలా విదేశాంగ మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయని, వాటిని ఖండిస్తున్నామని తెలిపింది. సైన్యం సహా వ్యవస్థలన్నీ తమ జాతీయ భద్రతకు మూలస్తంభాలని పాక్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి తాహిర్ పేర్కొన్నారు.

**32 ఏళ్ల తర్వాత.. షాంఘైలో కొత్త భవనంలోకి భారత కాన్సులేట్**

ఓ జాతీయ వార్తా సంస్థ ఇటీవల నిర్వహించిన సమిట్‌లో పాల్గొన్న ఎస్ జైశంకర్‌కు.. పాకిస్థాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ గురించి ప్రశ్న ఎదురైంది. ఇందుకు ఆయన బదులిస్తూ.. పాక్ సైన్యంపై విమర్శలు గుప్పించారు. దాని నిజస్వరూపం మనకు తెలుసని.. దానివల్లే మన దేశానికి సమస్యలు వచ్చి పడుతున్నాయని వ్యాఖ్యానించారు. వీటిపైనే దాయాది స్పందిస్తూ మరోసారి అక్కసు వెళ్లగక్కింది.



# ప్రజలు ఆశీర్వదించండి

## చంద్రన్న మార్కాపురం జిల్లాలో అభివృద్ధి చేసి చూపిస్తాం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి








**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిసెంబర్ 7)**

చంద్రన్న మార్కాపురం జిల్లా ఏర్పాటు ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా ప్రకటించడం పట్ల ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని 10, 11 వార్డుల్లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దోచుకుందని విమర్శించారు. రాష్ట్రం దివాలా తీయడం తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన మార్కాపురం డివిజన్‌ను తమ ప్రభుత్వం ప్రత్యేక జిల్లాగా ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టు రెండవ టన్నెల్ కోసం పాదయాత్ర ద్వారా సాధించానన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో వెలుగొండ ప్రాజెక్టును నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి పచ్చి మోసం చేశారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు రెండవ టన్నల్ రాకపోతే ఈ ప్రాంతం ఎండమావిగా మారుతుందని అలుపెరగని పోరాటం చేసి ఆనాటి ప్రభుత్వం ద్వారా సాధించానన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా మార్కాపురం జిల్లా సస్యశ్యామలం కానుందన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల కోసం కృషి చేస్తున్నన్నారు. ఈ ప్రాంతం వెనుకబడిందని, గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుంది అన్నారు. ఇందిరమ్మ కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఒకప్పుడు లక్ష యాభై వేలు పలికిన ఇందిరమ్మ ఇల్లు నేడు 10 లక్షలు పలుకుతుందని, ఆ కాలనీ అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. పేదల కోసం అహర్నిశలు శ్రమించే తనను ఆశీర్వదించాలని కోరారు. ఆస్తులు కూడా పెట్టుకోవడం కోసం రాజకీయాల్లోకి రాలేదని, పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు మాత్రమే తాను రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో చంద్రన్న మార్కాపురం జిల్లా అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారానే ఈరోజు భూములకు విపరీతమైన ధరలు వచ్చాయన్నారు, ఇది కూటమి ప్రభుత్వం వల్ల సాధ్యమైంది కాదా అని ప్రశ్నించారు. పేదల జీవితాలకు వెలుగు నింపడమే తమ ధ్యేయమని, ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తామన్నారు. నాణ్యమైన వైద్యం పేదలకు అందించాలన్న సంకల్పంతో జిల్లా వైద్యశాలను తీసుకురావడం జరిగిందన్నారు. పేదల కోసం తపించే తనకు పేదల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ఏర్పాటు ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు రావడం జరుగుతుందని ప్రజా పాలన కూడా మీ ముందుకు వస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా నిలవాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పూల వర్షంతో మహిళలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హిందూత్వ ముసుగులో బిజెపి ఫాసిస్ట్ విధానాలు

### వి శ్రీనివాసరావు

### ఒంగోలు సుందరయ్య భవన్‌లో ప్రారంభమైన సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**

బిజెపి ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఒంగోలు సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూత్వ ముసుగులో బిజెపి ఫాసిస్ట్ విధానాలను అమలు చేస్తూ దేశాన్ని ప్రమాదకర దిశగా నడుపుతున్నదని, ఈ విధానాలపై వామపక్ష శక్తులను కూడగట్టి ఎదుర్కోవలసిన అవసరం ఉందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని ప్రమాదకర దిశగా నడుపుతున్నదని తీవ్రంగా విమర్శించారు. మతాన్ని రాజకీయాలకు ముడిపెట్టి హిందుత్వ ముసుగులో ప్రజలను విభజించే ప్రయత్నం జరుగుతోందని, దీని ఫలితంగా దేశ లౌకిక శక్తులన్నీ ప్రమాదంలో పడుతున్నాయని ఆయన హెచ్చరించారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే బిజెపి పాలన లక్ష్యమైపోయిందని,




రాజ్యాంగ సూత్రాలను అమలు చేయకుండా రాజ్యాంగ విధ్వంసానికి కూడా వెనుకాడటం లేదని శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా మతభావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను మరుగున పడేస్తున్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు నిరుద్యోగం అసమానతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఇక చైనా వంటి సోషలిస్టు దేశాలు సంక్షోభాలకు లోనవకుండా భారీ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రపంచానికి ప్రత్యామ్నాయ ఆర్థిక మార్గాన్ని చూపుతున్నాయని చెప్పారు. ప్రపంచ యువత సోషలిజం వైపు ఆకర్షితులవుతున్నారన్నది ప్రస్తుత రాజకీయ–ఆర్థిక పరిస్థితికి నిదర్శనం అని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదను మోడీ అనుయాయులైన కార్పొరేట్లకు దోచిపెట్టడమే కాకుండా, మరోవైపు ప్రజలపై పన్నుల రూపంలో భారాలు మోపుతోందని, రైతాంగంపై పెట్టే భారాలు పెరిగిపోవడంతో ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహాలు తగ్గడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నదని చెప్పారు. అదే సమయంలో కార్మిక వర్గంపై దాడులు చేస్తూ హక్కులు హరిస్తున్న బిజెపి పాలనను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు, కార్యదర్శివర్గ సభ్యులు జీవి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం రమేష్, డి. సోమయ్య పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, పట్టణ, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

### జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి రాజబాబు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం.ఏపి.జిఓవి.ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్‌ను రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్‌కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఉరివేసుకుని ఎంటెక్ విద్యార్థిని నళిని ఆత్మహత్య



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**

ఎంటెక్ చదువుతున్న మయిరాల నళిని తన ఇంటిలోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒంగోలు నగరంలోని కబాడీపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఒన్ టౌన్ సిఐ వై నాగరుజు తెలిపిన వివరాల ప్రకారం నళిని ఎంటెక్ చదువుతూ గత పది సంవత్సరాల నుండి నగరంలోని మహేంద్ర నగర్‌కి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తితో పరిచయం ఏర్పరచుకుంది. ఆ పరిచయం ప్రేమకు దారితీసింది. ప్రేమించిన తనను వివాహం చేసుకోవాలని నళిని కోరడంతో శ్రీనివాసరావు అంగీకరించకపోవడంతో నళిని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుందన్నారు. కుటుంబ సభ్యులకు తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఉరి వేసుకుంటున్నట్లు ఫోటోలు పంపించిందని, దాంతో పాటుగా తాను మోసపోయానని, తాను మోసపోయినట్లు సూసైడ్ నోట్ రాసి మంచం పై ఉంచిందన్నారు. జరిగిన సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నళిని మృతి పై విచారణ చేపట్టి బాధ్యుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఉదయాన్నే మృతురాలు తండ్రి దేవదానం టిఫిన్ ఇద్దామని రూము తలుపు తట్టగా ఎంతకీ తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచి గడ్డపారతో తలుపు తొలగించామని తన కుమార్తె విగత జీవిగా వేలాడుతుందని బోరున విలపించారు.




# గుండెపోటుతో రైతు కూలీ మృతి



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 7)**

పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం గుండెపోటుతో ఒక రైతు కూలీ మృతి చెందిన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన మాదాల నరసింహారావు కుమారుడు మాదాల రాంబాబు (42) తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ కూలి పనులకు పోతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఒంట్లో నలతగా ఉందని గ్యాస్టిక్ ట్రబుల్ ఉపశమనం కోసం టానిక్ తాగి వాంతులు చేసుకొని కుప్పకూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే మానవత సంస్థ ప్రత్యేక వాహనంలో పొదిలి వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుల ధ్రువీకరించారు. అతడికి భార్య, 9వ తరగతి చదువుతున్న కుమార్తె, ఏడవ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. వేకువ జామున నాన్నకు బాగాలేదని హడావుడి పడ్డ రాంబాబు పిల్లలు వైద్యశాలకు వెళ్లి విగత జీవుడుగా ఇంటికి చేరడంతో నాన్న లే అంటూ ఆ చిన్నారుల ఆక్రందనలతో గ్రామం ఒక్కసారిగా కన్నీటి సంద్రంలో మునిగిపోయింది.

# రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**

ఒంగోలు రైల్వే స్టేషన్ యార్డు ఉత్తరం వైపు చివరన 5వ లైన్ నందు గుర్తు తెలియని మగ మనిషి రైలు బండి ఢీకొని మరణించాడు.

అతన వయస్సు సుమారు 25 నంచి 30 మధ్యలో ఉంటుంది. 5.5 అడుగులు ఎత్తు వరకు ఉండవచ్చు. ముదురు పచ్చ రంగు నిండు చేతుల టీ షర్టు, లైట్ సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంటు దానికి క్లాత్ బెల్టు ధరించి ఉన్నాడు. ఎడమవైపు భుజం పై భాగాన ఒక పుట్టిమచ్చ. ఎడమ రొమ్ము పై పుట్టుమచ్చ ఉన్నాయన్నారు. ఒంగోలు రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు జీఆర్పీ ఎస్ఐ కె మధుసూదన్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడిని గుర్తించుటకు ఎటువంటి ఆధారాలు దొరకలేదు. మృతుని వివరాలు తెలిసిన వారు ఒంగోలు ఆర్పీ ఎస్ఐ కె మధుసూదన్‌రావుకి 9440627647 తెలియజేయాలని కోరారు.

# "శ్రీ షిర్డీ సాయి మహాసమాధి" పుస్తకావిష్కరణ

## సాయి సచ్చరిత్ర పారాయణ మహా యజ్ఞం పూర్ణాహుతి





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 7)**

కనిగిరి మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి స్వగృహం నందు గురు మాతాజీ ఆధ్వర్యంలో ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముక్కు కాశిరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు, హెూమం నిర్వహించారు. బాబా పారాయణం చేసిన ప్రతి భక్తులు హెూమం ద్రవ్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమం అనంతరం హైదరాబాద్ వాస్తవ్యులు విజయ కిషోర్ చే రచింపబడిన, శ్రీ సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, ముచ్చర్ల ధర్మారావులచే ప్రచురించిన "శ్రీ సాయి మహాసమాధి" పుస్తకాన్ని శ్రీ గురు విశుద్ధానంద భారతిచే పుస్తకావిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శుద్ధ చైతన్యానంద స్వామి, మాజీ మంత్రి మానుగుంట మహీదర్‌రెడ్డి, కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, సాయిబాబా దేవస్థానం అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, మడతల కస్తూరిరెడ్డి, గాయం బలరాంరెడ్డి దంపతులు, సింగరాజు మాల కొండేశ్వరరావు, నాగేశ్వర్‌రెడ్డి, అంకయ్యస్వామి, బ్రహ్మయ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాతాజీ సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు మాతాజీ తీర్థ ప్రసాద వితరణ, ఆశీర్వచనాలు అందజేశారు.

# అమరావతిలో జనవరి 3 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**



ప్రతి నోట తెలుగుమాట అన్న నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సారస్వత రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాష బడి భాష మాత్రమేకాదని అమ్మఒడి భాషగా గుర్తించాలని, అధికార భాషగానే కాకుండా మమకార భాషగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్క తెలుగువారు కృషిచేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచరను నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ఆవిష్కరించారు. 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతిలోని శ్రీ సత్యాసాయి స్పిరిచ్యువల్ సొసైటీలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహాసభలు ప్రారంభిస్తారని వీరితోపాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, భారత ఉపరాష్ట్రపతి, ఆరు రాష్ట్రాల గవర్నర్లు పాల్గొంటారన్నారు. మూడు రోజులు జరిగే సభల్లో పద్య, వచన, అవధాన, భక్తి, సాహిత్య సదస్సులు, పత్రిక, బాలసాహిత్య, జానపద, ఫ్లినం, చలనచిత్ర, సాహిత్యాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవిదేశాల నుంచి అనేకమంది తెలుగువారు మహాసభల్లో పాల్గొంటున్నారని ప్రకాశంజిల్లా కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్య అభిమానులు మూడు రోజులు జరిగే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నందమూరి తారకరామారావు వేదిక, శ్రీనాధకవి వేదిక, తూము నరసింహదాసు వేదిక, డాక్టర్ ఘంటశాల, డాక్టర్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం వేదిక, రామోజీరావు ప్రదర్శనల ప్రాంగణం, కొప్పరపు కవుల వేదిక, జాషువా, కరుణశ్రీ వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు, సభా కార్యక్రమాలు, పూర్ణకుంభ ప్రధానోత్సవం, ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం, సౌజన్య సేవా పురస్కారాల ప్రదానోత్సవం, గ్రంథాల ఆవిష్కరణలు, ఆంధ్రమేవ జయతే ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, కవి సమ్మేళనాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే కవులకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, అందరికి భోజన, సాధారణ వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నెక్స్ట్‌జెన్ స్కూలు డైరక్టర్లు మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్, అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ రమేష్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# కారుమంచి పాఠశాలకు ఇనుప టేబుల్స్ బహూకరణ



**(షణ్ముఖ వెలుగు, కొండపి, డిసెంబర్ 7)**

టంగుటూరు మండలం కారుమంచి మోడల్ ప్రాథమిక పాఠశాలకు రూ.25 వేలు విలువచేసే ఐదు ఇనుప టేబుల్స్, ఐదు కుర్చీలు గ్రామ రిటైర్డ్ ఎంప్లాయిస్ చక్క రాజయ్య, చక్క రామకృష్ణ, మన్నం పోతురాజు, చొప్పర ఆదినారాయణ, మన్నం ఆదినారాయణ కలిసి బహుకరించారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో నీళ్ల సంపును కూడా గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాసులు ఏర్పాటు చేసారు. దాతలను మండల విద్యాశాఖ అధికారి మహతి బాలాజీ అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకోటయ్య, ఉపాధ్యాయ అబ్దుల్ హై, నందనవనం గాయత్రి, ధరణికోట లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

# చెన్నకేశవ ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా సమావేశం



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 7)**

స్థానిక చెన్నకేశవ దేవాలయంలో ఆదివారం విశ్వహిందూ పరిష త్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్సంగ ప్రముఖుడు సోమ సుబ్బారావు మాట్లాడుతూ కులాల నిర్మూలన ద్వారా హైందవుల ఐక్యత సాధ్యమవుతుందని, గడప లోపల కులం అని గడప దాటితే మనమంతా హిందువులమని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ఈదర బలరాం మాట్లాడుతూ పర ధర్మాల పట్ల జాగూరకతో వ్యవహరించాలని యువత సక్రమ మార్గంలో నడవడానికి తల్లులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లవరపు శ్రీనివాసులు, జరుగుమల్లి, సింగరాయకొండ, కొండపి, మర్రిపూడి మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.





# యువత ఆరోగ్య సంరక్షణ పై దృష్టి సారించాలి

**వ్యాయామం, నడక, మారథాన్ కార్యక్రమాలతో ఆరోగ్యానికి మేలు**
**ప్రజారోగ్యం కోసం కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది**
**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**









**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిసెంబర్ 7)**
యువత ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పిలుపునిచ్చారు. ప్రతి రోజు వ్యాయామం, నడవడం వంటి వాటి కారణంగా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఆదివారం తణుకు పట్టణంలోని చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద 'తణుకు రన్నర్స్ సొసైటీ' భాగస్వామ్యంతో స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన 'తణుకు రోడ్డు రన్' 10 కె, 5 కె, 3కె కార్యక్రమానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పించిన ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా తణుకు రన్నర్స్ సొసైటీ భాగస్వామ్యంతో నేడు తణుకులో ఇంత పెద్ద ఎత్తున 'తణుకు రోడ్డు రన్' కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైజాగ్ లో దేశంలో ఎక్కడా జరగని విధంగా ఐదు లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించిన కూటమి ప్రభుత్వం గిన్నిస్ రికార్డు నెలకొల్పిన విషయాన్ని గుర్తు చేశారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించిన ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం పరిశుభ్రంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఆశయం తెలిపారు. రోజులో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం కేటాయించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ... తణుకు రోడ్డు రన్ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పై దృష్టి పెట్టాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఒక నెలరోజుల పాటు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతిరోజు యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నేడు తణుకు రోడ్ రన్ స్ఫూర్తితో ప్రతిరోజు యువత ఫిట్నెస్ కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ... తణుకు రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో 3కె, 5కె, 10కె విభాగాల్లో ఈ రోడ్ రన్ నిర్వహించుకోవడం జరిగిందన్నారు. తణుకు పట్టణం క్లీనర్, గ్రీనర్, హెల్దీయర్ గా ఉండటంతోపాటు ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం రెండవసారి నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 2,500 మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ సాధనకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. తణుకు రోడ్డు రన్ కార్యక్రమంలో 3కె రన్ విభాగం రన్నింగ్ లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో పాల్గొన్నారు. తణుకు రోడ్డు రన్ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు, రోడ్ రన్ నిర్వాహకులు విశ్వతేజ, సాయిదీప్తి, కృష్ణ కిరణ్, వినయ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

## మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 7)**
పొన్నలూరు మండల యుటిఎఫ్ శాఖ నూతన కార్యవర్గాన్ని కందుకూరులోని దాచురి రామిరెడ్డి విజ్ఞాన భవన్ నందు ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. మండల శాఖ నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వున్నం వెంకట్రావు, చౌడం లక్ష్మి నారాయణలు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జాగర్లమూడి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా తానికొండ వెంకట్రావు, సహాధ్యక్షురాలుగా ఎన్ తిరుమలేశ్వరి కోశాధికారిగా పగడాల వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా కార్యదర్శిగా తాటికొండ లక్ష్మీప్రసన్న, బి లక్ష్మీనారాయణలను ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గం పలు తీర్మానాలను ఆమోదించింది. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలి. 2011 ముందు నియామకమైనటువంటి ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలి. 12వ పిఆర్సి కమిషన్‌ను పునరుద్ధరించాలి. 29 శాతం తాత్కాలిక భృతి ప్రకటించాలి. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.

## మెడికల్ హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 7)**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల హాస్పిటల్ ప్రైవేటికరణకు వ్యతిరేకంగా 35వ బ్లాక్‌లో వేల సంఖ్యలో సంతకాలు ప్రజల వద్ద నుండి సేకరణ చేసి మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ అన్నా వెంకట రాంబాబు, పట్టణ అధ్యక్షులు షేక్ సలీం కు అందించారు. ఈ కార్యాక్రమంలో 35వ బ్లాక్ ఇంచార్జ్ గుంటక చెన్నరెడ్డి, అధ్యక్షులు సిరివెళ్ల తిరుపతిరెడ్డి, గంజి లింగారెడ్డి, బ్రహ్మారెడ్డి, శివ శంకర్ రెడ్డి, బాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్, స్టడీ మెటీరియల్ పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, కొండపి, డిసెంబర్ 7)**
టంగుటూరు మండలం కారు మంచి ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్, స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా టంగుటూరు ఎంఈఓ2 మహతి బాలాజీగా హాజరై పదవ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్ రైటింగ్ ప్యాడ్, పెన్స్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై తన సొంత నిధులతో ఖర్చు చేసి అందించిన మెటీరియల్‌ను విద్యార్థులకు అందరికీ ఎంఈఓ మహతి బాలాజీ పంపిణీ చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయి మోటివేషన్ చేసి వారిని పదోవ తరగతి పరీక్ష వ్రాయుటకు సంసిద్ధులు చేశారు. యుటిఎఫ్ టంగుటూరు మండల అధ్యక్షులు కాట్రగడ్డ రమేష్ బాబు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఈ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మంచి మార్కులతో పాసై స్కూలుకు ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పూర్ణ శ్రీ, దామచర్ల శ్రీధర్, డి బాలకోటయ్య, సుబ్బన్న చారి, జవహర్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు అరుణాదేవి, ఉషారాణి, తెలుగు తల్లి, అంజని కుమారి, శీను బాబు, రంగారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.






# సమస్త జీవరాశులకు నీరు జీవనాధారం పై అవగాహన

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**
స్థానిక ముంగమూరు రోడ్లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల వాలంటీర్లు జాతీయ సేవా పథకంలో భాగంగా యునిట్ 1, యునిట్ 2 కొత్తపట్నం మండలం సంకువారిగుంట, టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంలో సమస్త జీవరాశులకు ప్రాణాధారమైన నీరు పై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ వై సత్యనారాయణరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నీటి కొరత, కాలుష్యం నేపద్యంలో నీటి సంరక్షణ అవశ్యకత పై ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరమన్నారు. నీటిని జాగ్రత్తగా ఉపయోగించడం ద్వారా మన భవిష్యత్తును సంరక్షించుకోవచ్చునని, నీటిని వృధా చేయకుండా ప్రతి నీటి బిందువును కాపాడుకోవాల్సిన అవసరం మనందరి బాధ్యత అని వాలంటీర్లకు తెలియచేశారు. అనంతరం రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి వాలంటీర్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి రాజేంద్రబాబు, పి నీలిమ, టి రవితేజ, బి శ్యామల, వైస్ ప్రిన్సిపల్ టి రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు నవీన్, రాయుడు, రాజకుమార్, నాయోమి, హ్యూమేరా అధ్యాపకేతార సిబ్బంది, ఆయ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పిజిఆర్ఎస్‌కు హాజరు కావాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోదకుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 7)**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీల పై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్‌లో, మండల తహశీల్దార్ల కార్యాలయాలలోను తహశీల్దార్లు, ఎంపీడిఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. మీకోసం.ఏపి.జిఓవి.ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని, పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# అంటరాని ప్రేమకు బలైన ఎంటెక్ యువతి

### నయవంచక ప్రేమికుడుతో పాటు కుటుంబీకులను అరెస్టు చేయాలి
### దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**

అంటరాని ప్రేమకు కులం కాటుకు గురై స్థానిక కబాడీపాలెంకు చెందిన ఎంటెక్ చదువుతున్న మైరాల నళిని ఆదివారం ఉదయం బలవన్మరణం చెందింది. మైరాల నళిని ఎంటెక్ చదివి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఉంది. ఈ క్రమంలో ఇంస్టాగ్రామ్ లో పరిచయమైన సింగూరి శ్రీనివాస్ స్థానిక మహేంద్ర నగర్ కు చెందిన యువకుడు ఈమెతో చాటింగ్ చేసాడు. ప్రేమించానన్నాడు పెళ్లి చేసుకుంటానన్నాడు. ఇదే మాటలు పదేళ్లుగా చెప్తూనే ఉన్నాడు. నువ్వు లేకపోతే నేను అన్నాడు. నీతోనే నా జీవితం అన్నాడు. రాను రాను సింగూరి శ్రీనివాస్ మాట మారింది. తన అవసరాలు తీర్చుకున్నాడు. ఆర్థికంగా కూడా నళిని దోచుకున్నాడు. అవసరాలన్నీ పూర్తయ్యాక కులం అడ్డు వచ్చింది. మీ కులం వేరు మా కులం వేరు మా ఇంట్లో వాళ్ళు పెళ్ళికి ఒప్పుకోవడం లేదు అంటూ కులం కార్డును ప్రయోగించాడు. శ్రీనివాసును నిజంగా తనను పెళ్లి చేసుకుంటాడని నమ్మిన నళిని అతని నయవంచనను తట్టుకోలేకపోయింది. క్రమేపి ఆమె ఫోన్ కి కూడా స్పందించడం ఆపేశాడు. ఇక లాభం లేదని నళిని నేరుగా మహేంద్ర నగర్ లోని శ్రీనివాస్ ఇంటికి వెళ్ళింది. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు మాలధారణలో ఉన్నామని నువ్వు మా ఇంట్లోకి రాకూడదు అని నళినిని గెంటేసి అవమానించారు. అప్పుడు నళిని తాను మోసపోయానని గ్రహించింది. తన అవసరాలన్నీ తీర్చుకొని ప్రేమించానని, వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి పది సంవత్సరాలుగా తనను అన్ని విధాలుగా వాడుకొని అన్యాయం చేసిన శ్రీనివాస్ వైఖరికి విరక్తి చెందింది. ఆదివారం వేకువజామున తన ఇంట్లోనే గదిలో చీరతో ఉరి వేసుకుని బలవన్మరణం చెందింది. తన చావుకు సింగోతు శ్రీనివాసరావు అతని కుటుంబ సభ్యులు కారణమంటూ రెండు పేజీల సూసైడ్ నోట్‌ను స్పష్టంగా శ్రీనివాస్ కులం పేరుతో చేసిన మోసం గురించి స్పష్టంగా సూసైడ్ లెటర్ నళిని పేర్కొంది. పోలీస్ కేసు పెట్టిన తనను ఎవరు ఏమి చేయలేరంటూ తనను బెదిరించినట్లు కూడా సూసైడ్ నోట్లో పేర్కొంది. నలుగురు ఆడపిల్లల గల దేవదానం కుటుంబంలో ముగ్గురు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు కాగా నళిని నాలుగో సంతానంగా ఉంది. ఇంతకీ నళిని పట్ల అంటరాని ప్రేమ నటించిన అపర వంచకుడు అపర ప్రేమికుడు అగ్నికుల క్షత్రియ చెందినవాడు కావడం విశేషం. నళిని బలవన్మరణం చెందిన తర్వాత మరల ఇద్దరు మహిళలను నళిని ఇంటికి పంపించి పరిసరాలను గమనించాలని పంపించాడు. నళిని బలవన్మరణం గురించి స్థానిక కబాడీపాలెం వాసులు దళిత నేత నీలం నాగేంద్రరావును ఆశ్రయించారు. సంఘటనా స్థలానికి వెళ్లి నళిని మృతదేహంతో పాటు నళిని రాసిన సూసైడ్ లెటర్‌ను నాగేంద్రరావు పరిశీలించారు. ఒంగోలు టూ టౌన్ సిఐ డ్యూటీ పని మీద గుంటూరు వెళ్ళగా ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు నళిని మృతదేహం వద్దకు వచ్చి నీలం నాగేంద్ర సమక్షంలో కుటుంబ సభ్యులను విచారించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

# భాగ్యనగర్ 2వ లైన్ పార్కులో శ్రీరామ్ హస్పటల్ వారి ఉచిత వైద్య శిబిరం









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**

ప్రతి నెల మొదటి ఆదివారం వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆదివారం ఉదయం ఒంగోలు భాగ్యనగర్ 2వ లైన్ పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో 150 మంది పేషెంట్లు పాల్గొని ఉచితంగా బిపి, షుగర్, థైరాయిడ్ , ఈసీజీ, హెచ్. బి, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు లాంటి సుమారు నాలుగువేల రూపాయల విలువగల పరీక్షలు ఉచితంగా పొందడం జరిగింది. స్థానిక నివాసి మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో భాగ్యనగర్ కాలనీ వాకర్స్, ప్రజలు పాల్గొని తమ ఆరోగ్య సంరక్షణ గురించి పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరం నందు ఎముకలు, నరాలు, కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ చేపల వంశీకృష్ణ, ప్రముఖ జనరల్ మెడిసిన్ అండ్ డయాబెటాలజీ వైద్య నిపుణులు సానల ధీరజ్ బాబు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్ , ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సానల మహిత అందరినీ పరీక్షించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ శిబిరంలో స్థానిక కార్పొరేటర్ శ్రీనివాస్, పార్క్ వ్యవస్థాపకులు ఆళ్ల వెంకటేశ్వర్లు, నాగులుప్పలపాడు ఎంపీడీఓ మాజీ మెప్మా పీడీ రవి కుమార్, ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాజా రాజ్ కుమార్, పార్క్ సెక్రటరీ బాబ్జీ, ఇండ్ల రామయ్య తదితరులు పాల్గొని శ్రీరామ్ హాస్పటల్ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అందిస్తున్న సేవలను కొనియాడారు.

# ఘనంగా గాండ్ల సంక్షేమ సంఘ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



## నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం







**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 7)**

పొదిలి పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో పొదిలి యూనిట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సలహాదారులు తంగెళ్ళ నాగభూషణం, రాష్ట్ర సంఘ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసులు జిల్లా యూత్ కన్వీనర్ రోషన్ బాబు చేతుల మీదుగా గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం రిజిస్టర్ నెంబర్ 366/2025తో పొదిలి యూనిట్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా దాసరి గురుస్వామి, సహాధ్యక్షులుగా మాడిశెట్టి హారిక, సహ కార్యదర్శిగా చిట్టెంశెట్టి శ్రీనివాసులు, కోశాధికారిగా బూదాటి వెంకట నిమ్మేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా దుడ్డు శంకరరావు, ముత్యాలపాటి రామారావు, ఆళ్ల చెరువు విక్రమార్క్, చాకిరాల చంద్రకుమారిలను నూతనంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ సలహాదారులు తంగేళ్ల నాగభూషణం మాట్లాడుతూ గాండ్ల కార్పొరేషన్, కమ్యూనిటీ బిల్డింగ్ సాధించాలని, అది సాధించాలంటే గాండ్ల తెలికుల సామాజిక ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి వరికుంట్ల హనుమంతరావు, యూత్ కన్వీనర్ బోయిళ్ళ రోషన్ బాబు, చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, దుడ్డు హరి, గుంటిక కృష్ణ, ఫణి మాధవి, అనూష, వరికుంట్ల వెంకటేశ్వర్లు, భూదాటి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# జాతికి జ్ఞాన గమ్యం రామాయణం
## చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)**

సత్య ధర్మ స్వరూప ప్రతిపాదితమైన రామాయణం భారత జాతికి మాత్రమే కాకుండా యావత్తు మానవాళికి జ్ఞానగమ్యమని చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పేర్కొన్నారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్తంగా శ్రీగిరి గో క్షేత్ర భవనంలో ఆదివారం నిర్వహించిన బాల విహార్ శిక్షణా తరగతులలో పవిత్ర చైతన్య విద్యార్థులకు రామాయణంతోపాటు భారత భాగవత భగవద్గీతలలోని ఉపయుక్త విషయాలను వివరించి చెప్పారు. బాల విహార్ శిక్షణా తరగతుల వల్ల విద్యార్థులలో బహుముఖ సంస్కారాలు నైపుణ్యాలు మరింత వృద్ధి చెందుతాయని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వాహకులు, చిన్మయ మిషన్ ప్రతినిధులు చేస్తున్న కృషిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

# ఘనంగా ఎరిక్షన్ బాబు జన్మదిన వేడుకలు




**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, డిసెంబర్ 7)**

యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం యర్రగొండపాలెం పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పుట్టినరోజు సందర్భంగా ఇంఛార్జిని పలువురు మండల నాయకులు కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో పుల్లలచెరువు మండలపార్టీ అధ్యక్షుడు పోట్ల గోవిందు, పుల్లలచెరువు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కేసనపల్లి బక్కయ్య, ఏపిఎం నూనె వెంకయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, సోమేపల్లి వెంకట సుబ్బారావు, డి బ్రహ్మయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పల్లపాటి బాదరయ్య, పుల్లలచెరువు యూనిట్ ఇంఛార్జి మేడికొండ లక్ష్మీ నారాయణ (సామ్రాట్), గంగవరం ఫీల్డ్ అసిస్టెంట్ ఏడుకొండలు ఉన్నారు.

# ప్రత్యేక జిల్లాతో పరుగులు పెట్టనున్న అభివృద్ధి
## సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం





**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, డిసెంబర్ 7)**

ప్రత్యేక జిల్లాతో అభివృద్ధి పరుగులు పెడుతుందని మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాను ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని చింతగుంట గ్రామంలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు మూరబోయిన బాబురావు యాదవ్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 63 రోజుల పాటు అన్ని పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి చేసిన పోరాట ఫలితంగానే నేడు జిల్లా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా వెనుకబడిన పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మార్కాపురం జిల్లా ప్రకటించడం జరిగిందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుందురు కాశిరెడ్డి, ముప్వ కాటంరాజు, శ్రీకాంత్‌రెడ్డి, రోశయ్య, తిరుపతయ్య, ఏడుకొండలు, శ్రీను, పాపయ్య, గురవయ్య, పెద్ద నారాయణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తొర్రగుడిపాడు క్రిస్టియన్ కాలనీ వాసులు

**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 7)**

సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్‌ను తొర్రగుడిపాడు తెలుగుదేశంపార్టీ నాయకులు మొండితోక అహరోన్, తొర్రగుడిపాడు క్రిస్టియన్ కాలనీ వాసులు ఆదివారం సాయంత్రం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు తొర్రగుడిపాడు గ్రామానికి సంబంధించి పలు సమస్యలను వివరించారు. ఈ నెల 21వ తేదీన తొర్రగుడిపాడులో నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ను ఆహ్వానించారు. వారితో పాటు పాస్టర్ మున్నంగి జాన్ రాజు, కొమ్ము అమోస్, అబ్రాహాము, శామ్యూల్, స్టీవెన్ బాబు, రాజశేఖర్, అక్కులు, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.



# చిట్యాల కాశమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 7)

దోర్నాల మండలం చిన్న గుడిపాడు గ్రామంలో చిట్యాల వెంకటేశ్వరరెడ్డి తల్లి చిట్యాల కాశమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంటు పరిశీలికులు జంకె వెంకటరెడ్డిలు పాల్గొని ఆమెకు నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. వారి వెంట మండల కన్వీనర్లు గంట రమణారెడ్డి. జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, ఎర్రగొండపాలెం కన్వీనర్ ముసలారెడ్డి, మండల నాయకులు సేనారెడ్డి, పెద్దారవీడు మండల ఉపాధ్యక్షులు తోక ఆవులయ్య యాదవ్, గ్రామ సర్పంచ్ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విధానం వస్తున్న మార్పుల పై అవగాహన




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 7)

వైద్య విభాగంలో కొత్తగా వస్తున్న యంత్రాలను ఒక రకమైన ప్లాస్టిక్ యంత్రాలతో ముందు పరీక్షలు నిర్వహించిన తర్వాత మానవాళిపై ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని అరవింద సూపర్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ మందలపూ నరేంద్రబాబు, డాక్టర్ భాను తేజ తెలిపారు. నగరంలోని కెబి సమావేశ మందిరంలో సీఎంఈ ద్వితీయ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒలంపస్ సహకారంతో అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో ఈ సెమినార్ నిర్వహించినట్లు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ ట్రబుల్ ఎక్కువగా వస్తుందని అది అనేక రూపాలలో కనుపండుతున్నదని దానికోసం ఎండోస్కోపి, కొలనోస్కోపి, బ్రాంకోస్కోపి ద్వారా కనబడతాం జరుగుతుందని తెలిపారు. కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో వైద్య విధానం వస్తున్న మార్పులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దీని ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సెమినార్‌కి డాక్టర్ సుబ్బారావు నాయుడు, డాక్టర్ హరిబాబు, హైకోర్టు న్యాయవాది ఏడుకొండలు, నగరంలోని ప్రముఖ వైద్యులు, జిల్లాలోని వైద్యులు పాల్గొన్నారు.

# ఆర్తో సమస్యల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

## ఆర్థోపెడిక్ డాక్టర్ వివేకానందరెడ్డి



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 7)

ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్తో సమస్యలతో ప్రజలు ఎక్కువ శాతం ఇబ్బంది పడుతున్నారని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఎప్పటికప్పుడు సంబంధించిన వైద్యులను కలిసి తగిన సలహాలు వైద్య పరీక్షలు చేపించుకున్నప్పుడే ఆర్తో సమస్య సంభవించకుండా ఉంటారని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ వివేకానందరెడ్డి అన్నారు. శనివారం బద్వేల్ పట్టనం నిర్వాణ హాస్పిటల్ కు విచ్చేసిన అపోలో స్పెషలిటీ హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ వివేకానందరెడ్డి పట్టణంలో పలువురు ఆర్థో సమస్యల ఉన్నవారికి వివిధ రకాల సలహాలు సూచనలు ఇస్తూ వైద్య పరీక్షలను నిర్వహించారు. వయసు పైబడిన వారు ఆర్తో సమస్యలపై ఎప్పటికప్పుడు డాక్టర్ల సలహాలు సూచనలు తీసుకుంటూ డాక్టర్లు చెప్పిన విధంగా పాటించాలన్నారు. అలాగే మోకాళ్లు, నడుము నొప్పి సయాటికా లాంటి సమస్యలు ఉన్నవారు డాక్టర్లు తెలిపిన ఎక్సైజ్లు ఫిజియోథెరపీలు క్రమం తప్పకుండా చేపించుకోవాలన్నారు. తినే ఆహారంపు అలవాట్లను కొంత మార్చుకోవాలని ఎక్కువగా పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం పలువురికి ఆర్తో సమస్యల ఉన్నవారి సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి



ప్రత్యేక మందులను అందజేశారు. డాక్టర్ వివేకానందరెడ్డి వైద్య రంగంలో అనేక సేవలు అందించడమే కాకుండా బద్వేల్ పట్టణంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గత ఐదు సంవత్సరాలగా మంచినీటి చలివేంద్రానికి సహకరించిన డాక్టర్ వివేకానందరెడ్డిని వార్త జర్నలిస్ట్ వల్లంకొండు వెంకటరమణ తో పాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిజియో తెరఫీ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ముడమాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపీయూజేడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేష్, అర్బన్ రిపోర్టర్ వల్లంకొండు వెంకటరమణ, పసుపుల రవిశంకర్, మంచా నాగార్జున, జొన్నలగడ్డ సుధాకర్, పబ్బతి చక్రపాణి, కొంజేటి చంద్రశేఖర్, పత్తి హరీష్, కొలిశెట్టి సుబ్రహ్మణ్యం, అపోలో హాస్పిటల్ సుకుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు జన్మదిన వేడుకలు

## వేలాదిగా తరలివచ్చి ఎరిక్షన్ బాబుకి శుభాకాంక్షలు తెలిపిన కూటమి శ్రేణులు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 7)

యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు జన్మదిన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లా నుండి గజమాలతో టీడీపీ, కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ ర్యాలీగా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చిన కూటమి శ్రేణులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎరిక్షన్ బాబుని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతులని దినోత్సవ వేడుకలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు వెంగళరెడ్డి, మెట్టు శ్రీనివాసరెడ్డి, పోత్రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.










On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com